క్లుప్తంగా

గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్

గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గురుకుల కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు చేపడుతున్నట్లు బుద్దారం గురుకుల ప్రిన్సిపాల్ ఆరోగ్యం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీలో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ అయ్యేందుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపీసీలో ఎస్సీ 3 సీట్లు, బైపీసీలో ఎస్సీ 2 మొత్తం ఐదు సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అడ్మిషన్ కావల్సిన వారు సోమవారం పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మదనాపురం: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అబ్రహం లింకన్ పరిశీలించారు. దుప్పల్లిలోని 173 పోలింగ్ కేంద్రం, అజ్జకొల్లు 219, 220, 221, 222 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, సౌకర్యాలను ఆయన స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రెడ్డి, బీఎల్‌ఓ తారమ్మ ఉన్నారు.

పందులతో పరేషాన్!

అమరచింత: పట్టణంలోని కాలనీల్లో నిత్యం పందులు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రజలను రోగాల పాలు చేస్తున్నా వాటిని తరలించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. పట్టణంలోని 10 వార్డుల్లో నిత్యం సంచరిస్తూ పాదచారులు తీసుకెళ్తున్న కూరగాయల సంచులను లాక్కొని వారిని గాయపర్చేందుకు పాల్పడుతున్నాయి. పందుల పెంపకం దారులను పిలిచి వాటిని తరలించమని చెప్పలేని స్థితిలో పాలక యంత్రాంగం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పందులను తరలించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి సుహాసన్‌రెడ్డి దరఖాస్తు



బిజినేపల్లి: నాగర్‌కర్నూల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా బిజినేపల్లి మండలానికి చెందిన యువనేత కూచుకుళ్ల సుహాసన్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశానని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

'కాంగ్రెస్ బలోపేతానికి పాటుపడదాం'



కొల్లాపూర్: యూత్ కాంగ్రెస్ బలోపేతం కోసం పని చేస్తామని ఆ సంఘం యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ వంగ రాజశేఖర్‌గౌడ్, కౌన్సిలర్ రహీంపాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని జూపల్లి కృష్ణారావు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ పోస్టర్లను వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు కష్టపడి పనిచేయాలన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో యువతకు అన్యాయం చేసిందన్నారు. నాయకులు వేణుగోపాల్‌యాదవ్, రెడ్డి సత్యం, కర్నె శివ, నర్సింహా, మహేష్ యాదవ్ తదితరులున్నారు.

నేడు గద్దర్ సంస్మరణ సభ



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో సోమవారం ప్రజాయుద్ధనౌక గద్దర్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. సంస్మరణ సభకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. అదేవిధంగా ఆటోల ద్వారా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. గద్దర్ సంస్మరణ సభకు ఉద్యమకారులు, ప్రజా, కుల, విద్యార్థి సంఘాలు, రాజకీయ నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. మధుసూదన్‌బాబు, వాల్మీకి, కోళ్ల హుస్సేన్, గోపాల్‌రావు, నాగన్న, మన్యం, విజయ్‌కుమార్, మక్బూల్ పాల్గొన్నారు. అదేవిధంగా టీఎన్‌జీఓ భవనంలో నిర్వహించిన సమావేశంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆశన్న మాట్లాడారు. గద్దర్ తన ఆటపాటలతో పాలకుల విధానాలను ఎండగట్టి ప్రజలను చైతన్యపర్చారని, సంస్మరణ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహా, తిరుమలేష్, తిమ్మప్ప, వేణుగోపాల్ ఉన్నారు.

కరుణించని వరుణుడు

- ఎండుతున్న పంటలు – ఆందోళనలో రైతులు
- 3460 ఎకరాల్లో మెట్టపంటల సాగు



రోడ్డుమీదితండా శివారులో వాడుముఖం పట్టిన మొక్కజొన్న



అప్పారెడ్డిపల్లిలో వానలు లేకపోవడంతో వాడుబట్టిన పత్తి పంట

ఖిల్లాఘనపురం: యాసంగిలో వరి పంటలు కోత దశలో ఉండగా వర్షాలు కురిశాయి. దీంతో ఈ ఏడాది వర్షాల కాలం విస్తారంగా వర్షాలు పడతాయని రైతులు ఆశపడి మెట్ట పంటలు సాగు చేశారు. వరుణుడి కరుణలేక పంటలకు నీళ్లలేక రైతులు తీవ్ర నిరాశలో ఉన్నారు. నెలలు గడుస్తున్నా వరుణదేవుడు కరుణించకపోవడంతో మెట్టపంటలు ఎండిపోతున్నాయి. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

3460 ఎకరాల్లో మెట్టసాగు..

మండలంలో ఈ ఏడాది ముందే వర్షాలు కురవడంతో దుక్కులు సిద్ధం చేసుకున్నారు. మొత్తం 3460 ఎకరాల్లో మెట్టపంటలు సాగు చేశారు. పత్తి 2100 ఎకరాలు, మొక్క జొన్న 600, జొన్న 350, ఆముదం 70, కందులు 40, పెసర తదితర ఇతర పంటలు 300 ఎరాల్లో సాగు చేశారు. సాగు తరువాత 15 రోజుల పాటు వానలు కురవడంతో కలుపు తీయడానికే ఇబ్బందులు పడ్డారు. కలుపు తీసిన తరువాత వరుణదేవుడు పూర్తిగా మొఖం చాటేశాడు. దీంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

స్ప్రింక్లర్లతో తడులు..

నెలల తరబడి వానలు కురవక పోవడంతో చేసేది లేక బోరుబావులున్న రైతులు స్ప్రింక్లర్లతో నీటి తడులు పెడుతున్నారు. కేఎల్ఐ కాలువ సమీప రైతులు మోటర్ల ద్వారా పొలాలు తడుపుతున్నారు. నీటి వసతిలేని రైతులు వరుణదేవునిపై భారమేసి ఎదురు చూస్తున్నారు.

భూమి కౌలుకు తీసుకొని పత్తిపంట వేశా..

మెట్ట పంటల సాగుకు భూమి లేకపోవడంతో ఐదెకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట వేశాను. ఇప్పుడు పూత, కాత పడుతోంది. వానలు లేకపోవడంతో పంట ఎండిపోతోంది. మా బోరుబావిలో నీళ్లు లేవు. స్ప్రింక్లర్లు పెడితే పారడం లేదు. ఇప్పటికే రెండు లక్షల పైనే ఖర్చైంది. వానదేవుడి కోసం ఎదిరిచూస్తున్నాం.

– శేషయ్య, అప్పారెడ్డిపల్లి

ఇచ్చిన హామీని నెరవేర్చిన మంత్రి

పెబ్బేరు రూరల్: వనపర్తి పట్టణంలోని అంజనగిరిలో పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో ప్రజల కోరిక మేరకు బాలయ్యను మంత్రి నిరంజన్‌రెడ్డి నియమించి తన సొంత డబ్బులు ఇస్తానని చెప్పాడు. ఇచ్చిన మాట ప్రకారం మంత్రి బాలయ్యకు మూడు నెలల జీతం రూ.27వేలు పంపించి మాట నిలబెట్టుకున్నారు. నగదును ఆదివారం బీఆర్‌ఎస్ వనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త వంగూరు ప్రమోదు కుమార్‌రెడ్డి బాలయ్యకు అందజేశారు. అంజనగిరిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. పురుషోత్తంరెడ్డి, మాణిక్యం, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం



రామరాయనిపల్లిలో పూజలు చేస్తున్న పండితులు

ఖిల్లాఘనపురం: మండలంలోని రామరాయనిపల్లిలో పోచమ్మ, ఊరడమ్మ దేవతల దేవాలయాల్లో విగ్రహాలు, దీప స్తంభాలు, బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆంజనేయస్వామి దేవాలయంలో స్వామి వారికి ప్రత్యే క పూజలు నిర్వహించారు. సోమవారం విగ్రహాల ప్రతిష్ఠ ఉంటుందని సర్పంచ్ తెలిపారు.

చెరువులో పడి మహిళ మృతి

పెబ్బేరు రూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి మహిళ మృతి చెందిన ఘటన ఆదివారం వనపర్తి మండలంలోని చిట్యాలలో చోటుచేసుకుంది. వనపర్తి రూరల్ ఎస్ఐ నాగన్న కథనం ప్రకారం.. వనపర్తి మండలంలోని చిట్యాలకు చెందిన గొల్ల రేణుక(33) శనివారం ఉదయం 10గంటల సమయంలో బట్టలు ఉతకడానికి చెరువుకు వెళ్లి, బట్టలు ఉతికి కట్టపై ఆరేసింది. ఆమె అత్త,మామలు పొలం పనులు ముగించుకొని సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా, ఇంట్లో కోడలు లేకపోవడంతో గ్రామంలో వెతికారు. చెరువు దగ్గరకు వెళ్లి చూడగా ఆమె చెప్పులు, బట్టలు కనిపించాయి. చీకటికావడంతో ఇంటికి తిరిగొచ్చారు. ఆదివారం ఉదయం చెరువు దగ్గరికి వెళ్లి చూడగా రేణుక మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈఘటనపై రేణుక పెదనాన్న గోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



నినాదాలు చేస్తున్న నాయకులు

కొల్లాపూర్: మండల కేంద్రంలో 9,12,16 వార్డులకు చెందిన యువకులు ఆదివారం ఎమ్మెల్యే హర్షవర్ధన్ రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. అదేవిధంగా కొండూరు గ్రామానికి చెందిన 50 మంది జూపల్లి వర్గీయులు బీఆర్‌ఎస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై యువత, రైతులు పార్టీలో చేరుతున్నారన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, మార్కెట్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, నాయకులు సాంబశివుడు, జాఫర్, రుక్మద్దీన్‌తో పాటు పలువురున్నారు.

పూర్వపు వీఆర్‌ఓల సమస్యలు పరిష్కరించాలి

బిజినేపల్లి: పూర్వపు వీఆర్‌ఓల సమస్యలు పరిష్కరించాలని జిల్లా టీజీవో ప్రధాన కార్యదర్శి బాగవేణి నర్సింహులు కోరారు. ఆదివారం పాలెం ప్రభుత్వ కళాశాల ఎదుట పూర్వపు వీఆర్‌ఓలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపార్టుమెంటల్, సర్వేయర్, అకౌంట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వీఆర్‌ఓలకు పదోన్నతులు కల్పించలేదన్నారు. కార్యక్రమంలో పూర్వపు వీఆర్‌వోల సంఘం నాయకులు రఘు, రమేష్, శ్రీనివాసులు, సుధాకర్, నాగయ్య, వేంకటేష్, బాలరాజు, నరసింహ్మా, రాజేష్, శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



వీపనగండ్ల: మండలంలోని సంపత్‌రావుపల్లికి చెందిన వెంకటేశ్వర్లు ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ఆదివారం అతని సహ విద్యార్థులు రూ.60 వేల ఆర్థిక సాయం భార్య రేణుకమ్మకు అందజేశారు. 1986–87 పదో తరగతి విద్యార్థులు అందరు కలిసి నగదు జమచేసి వెంకటేశ్వర్లు కుటుంబాన్ని ఆదుకోవాలని సంకల్పించి అందించారు.

కంబాళాపురంలో..



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంబాళాపురంలో తెలుగు మహేష్ మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి చిన్నారెడ్డి, స్థానిక నాయకులతో కలిసి ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. అదే గ్రామంలో రామచంద్రమ్మ మృతి చెందడంతో మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములు, ఎంపీటీసీ ఎల్లస్వామి, అశోక్‌రెడ్డి, స్వామి, కృష్ణయ్య, మొగులయ్య, శ్రీనివాసులు, బాలయ్య ఉన్నారు.

చిట్యాలలో..



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిట్యాలకు చెందిన పాల్కంపల్లి రేణుక మృతి చెందడంతో బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుడు మేగారెడ్డి రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శంకర్‌నాయక్, కురుమూర్తి, పాండురావు, తదితరులు పాల్గొన్నారు.

హర్షవర్ధన్‌రెడ్డి గెలుపు ఖాయం

పెంట్లవెల్లి: రానున్న ఎన్నికల్లో కొల్లాపూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి హర్షవర్ధన్‌రెడ్డి భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని మండల అధ్యక్షుడు పోతుల వెంకటేశ్వర్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఆయనకు ప్రజలు పట్టం కడతారని తెలిపారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం కేసీఆర్, మంత్రి ఎస్ఎన్ఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

వనపర్తిటౌన్: సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డి చిత్రపటాలకు ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జిల్లా మినీ అంగన్‌వాడీ టీచర్లు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మినీ అంగన్‌వాడీ టీచర్ల జిల్లా అధ్యక్షురాలు గోపిక మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి చెప్పడంతో సీఎం దృష్టికి తీసుకెళ్లి మినీ అంగన్‌వాడీలను అప్ గ్రేడ్ చేస్తున్నట్లు ప్రకటించడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, అధికార ప్రతినిధి, మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు విప్పటూరి విక్రమ్, మినీ అంగన్‌వాడీ ఉపాధ్యక్షురాలు పీ పుష్పలత, వనపర్తి ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం. సరోజ, కవిత, కల్యాణి, సీతూ, సుమిత్ర, ప్రియ, జయ, తేజస్విని, మినీ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై ప్రత్యేక దృష్టి..



అమరచింతలో వివరాలను సేకరిస్తున్న తహసీల్దార్ చాంద్‌పాషా



వీపనగండ్లలో..

అమరచింత: కొత్త ఓటర్ల నమోదుతో పాటు జాబితాలో పేర్ల తప్పొప్పులను సవరించేందుకు బీఎల్‌ఓలు ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ చాంద్‌పాషా తెలిపారు. ఆదివారం పట్టణంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఆయన సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. శని, ఆదివారాలలో ప్రత్యేక క్యాంపుల ద్వారా ఫారం–6కు సంబంధించి 53 దరఖాస్తులు, ఫారం–8కు 26 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. బీఎల్‌ఓలు ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాపై సర్వే నిర్వహించి వారి అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ వెంకటయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

పాన్‌గల్: అక్టోబర్ ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తయ్యే యువతీ యువకులు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని డీటీ చక్రపాణి బీఎల్‌ఓలకు సూచించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని చింతకుంట, గోప్లాపూర్ గ్రామాల్లో ఓటరు నమోదు శిబిరాలను ఆయన సందర్శించారు. కొత్తగా ఓటరు నమోదుకు ఎన్ని దరఖాస్తులు, పేరు మార్పులు, చేర్పులపై ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే విషయాలపై ఆయా గ్రామాల బీఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐలు మహేష్, తిరుపతయ్య, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ..

వీపనగండ్ల: అర్హులైనవారి నుంచి నూతన ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ప్రత్యేక కేంద్రాలలో అర్హులైన వారి నుంచి బీఎల్‌ఓలు ఆదివారం దరఖాస్తులు స్వీకరించారు. మండలంలో మొత్తం 14 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ వరలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలో 13 మంది అర్హులైన యువతీ యువకులు ఓటర్ నమోదు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు బీఎల్‌ఓలు సుగుణబాయ్, కమల, సువర్ణ, మహేశ్వరి, ఎల్లమ్మ తెలిపారు.

రోడ్డున్నా.. బస్సు రాదాయె!



దావాత్‌ఖాన్‌పల్లి తారురోడ్డు

పాన్‌గల్: నేటికీ ఆర్టీసీ బస్సులు వెళ్లని పల్లెలున్నాయంటే అతిశయోక్తి కాదు. పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పల్లెల ప్రజలు రవాణా పరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్టీసీ బస్సులు లేక కాలినడక, ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లి, ఆకునోనిపల్లె, ఆకునోనిపల్లెతండా, మంగాళ్లపల్లి, గోప్లాపూర్, కిష్టాపూర్, కిష్టాపూర్‌తండా వంటి గ్రామాలకు బీటీ రోడ్డున్నా నేటికీ ఆర్టీసీ బస్సులు వెళ్లడం లేదు. ఆర్టీసీ బస్సులు తమ గ్రామాలకు వేయాలని ఎన్నో సార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు వినతులు ఇచ్చినా బుట్టదాఖలయ్యాయి తప్ప బస్సులు రాలేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్‌రెడ్డి

గోపాల్‌పేట: బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని నియోజకవర్గ ఎన్నికల సమన్వయకర్త ప్రమోద్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కార్యకర్తలు టీఆర్‌ఎస్ అభ్యర్థి నిరంజన్‌రెడ్డి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ భార్గవి, మండల పార్టీ అధ్యక్షుడు కోదండం, నాయకులు తిరుపతియాదవ్, కోటిరెడ్డి, శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభం..

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో బీఆర్‌ఎస్ నూతన కార్యాలయాన్ని వైస్ ఎంపీపీ వడ్డె శ్రీనివాసులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించేందుకు పార్టీ కార్యాలయంలో ప్రణాళికలు సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలను, నాయకులను సమాయత్తం చేసేందుకు బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రావుల గోపాల్‌రెడ్డి, హోటల్ రాజు, రమేష్ రెడ్డి, శేఖర్‌గౌడ్, బక్క శ్రీను, వెంకటేష్, అంజన్న, రవీందర్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ నాగరాజు, నక్కల నర్సింహ, మొగులయ్య, వడ్డె నాగరాజు, ఉప్పరి శ్రీను, రామన్‌గౌడ్, శివ, అంజినాయక్, రాజు, నర్సింహ, లక్ష్మణ్, వెంకటయ్య, రాములు ఉన్నారు.

ప్రమాదకరం రోడ్డు మలుపులు



దావాజిపల్లి సమీపంలో ప్రమాదకరంగా మలుపు

పాన్‌గల్: మండలం నుంచి వనపర్తి వెళ్లే, కొల్లాపూర్ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై మలుపులు ప్రమాకరంగా ఉన్నాయి. పాన్‌గల్ సమీపంలో ఈద్గా దగ్గర, గోప్లాపూర్ స్టేజీ సమీపంలో, అన్నారంతండా సమీపంలో, దావాజీపల్లి స్టేజీ సమీపంలో మలుపుల్లో ప్రమాలు చోటుచేసుకుంటున్నాయి. గూడెం స్టేజీ సమీపంలో, వెంగళాయిపల్లి సమీపంలో, కేతేపల్లి సమీపంలో, తెల్లరాళ్లపల్లి సమీపంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. మలుపులు వద్ద సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులకు మలుపు ఉన్నట్లు తెలియక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రజాధనం వృథా..



ఆత్మకూర్ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం వద్ద వృథాగా రిక్షాబండి



మున్సిపాలిటీ వద్ద వృథాగా రిక్షా

ఆత్మకూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ్‌భారత్ మిషన్ ఆధ్వర్యంలో గ్రామాల్లో చెత్తను సేకరణకు ఏర్పాటు చేసిన చెత్తబండి రిక్షాలు నిరుపయోగంగా తుప్పుబట్టి మూలన పడ్డాయి. ఆత్మకూర్ మండలంలో ఆరేపల్లి, ఆత్మకూర్, తిప్డంపల్లి, దేవరపల్లి, రేచింతల, తూంపల్లి, కత్తేపల్లి, బాలకిష్టాపూర్ గ్రామాల్లో చెత్త సేకరణ రిక్షాలను గ్రామ పంచాయతీలకు అందించారు. కార్మికుల కొరత ఉండడంతో రిక్షాలు నిరుపయోగంగా మారాయి. ఆత్మకూర్ మున్సిపాలిటీలో చెత్త సేకరణకు ట్రాక్టర్లు, ఆటోలు ఉండటంతో రిక్షాలను పట్టించుకోవడం లేదు.

ట్రాక్టర్లు వినియోగిస్తున్నాం..



స్వచ్ఛ్‌భారత్ మిషన్‌లో భాగంగా గ్రామాల పరిశుభ్రత కోసం ఏర్పాటు చేసిన రిక్షాలు కార్మికుల కొరత వల్ల ఉపయోగించడం లేదు. ప్రతి గ్రామ పంచాయతీకి చెత్తను సేకరించేందుకు ప్రభుత్వం ట్రాక్టర్లను కేటాయించింది. ప్రతిరోజూ ట్రాక్టర్ల ద్వారా చెత్తను సేకరిస్తున్నాం.

– వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ, ఆత్మకూర్

వెలగని విద్యుత్ దీపాలు

అమరచింత: ఉమ్మడి జిల్లాకు వరప్రదాయనిగా ఉన్న ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుపై విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో రాత్రుల్లో అంధకారం ఉంటోంది. డ్యాం పరసరాలు, రహదారి చీకటిగా మారుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. జూరాల నీటితో జెన్‌కో అధికారులు విద్యుత్ ఉత్పత్తి ఇక్కడి నుంచే చేస్తున్నా ప్రాజెక్టుపై మాత్రం వెలుగులకు నోచుకోవడం లేదు. విద్యుత్ సరఫరా కోసం ఏర్పాటు చేసిన స్తంభాలు అలంకార ప్రాయంగా మారాయి. ప్రాజెక్టు అధికారులు పట్టించుకొని రాత్రి సమయంలో వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, పర్యాటకులు కోరుతున్నారు.



జూరాల ప్రాజెక్టుపై వెలగని విద్యుత్ బల్బులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com